నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, శుక్రవారం 12 జనవరి 2024 | KHAMMAM



భద్రాచలం, జనవరి 11: బీఆర్ఎస్ మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశం గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగింది. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ హాజరయ్యారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పాల్గొని శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.

# యాసంగి 50 వేల ఎకరాలే..

**ఈ ఏడాది రికార్డుస్థాయిలో తగ్గిన సాగు**

- ఖమ్మం జిల్లా చరిత్రలో ఇదే తొలిసారి
- గతేడాది 3,15,375 ఎకరాల్లో పంటలు
- బోసిపోతున్న ఆయకట్టు విస్తీర్ణం
- వర్షాలు లేకపోవడమే ప్రధానకారణం
- నాగార్జునసాగర్‌లో డెడ్‌స్టోరేజీ
- అందని 'రైతుబంధు'.. పెట్టుబడికి ఇబ్బందులు



ఖమ్మంజిల్లాలో యాసంగి సాగు ఈ ఏడాది రికార్డు స్థాయిలో తగ్గిపోయింది. గతేడాది వరకు 3 లక్షల ఎకరాలకు పైగా పంటలు సాగు కాగా.. ఈసారి కేవలం 50 వేల ఎకరాలకే పరిమితమైంది. జిల్లాలో మొత్తం 21 మండలాలకు 16 మండలాలు సాగర్ ఆయకట్టు పరిధిలోనే ఉన్నాయి. సాగర్ కాలువ పరిధిలో సుమారు 1.50 లక్షల ఎకరాలు, చెరువులు, కుంటలు, బోరుబావుల కింద 2 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతున్నది. ఈ వానకాలం సరైన వర్షపాతం లేక భూగర్భజలాలు అడుగంటడం, నాగార్జున సాగర్‌లో సైతం నీరు లేకపోవడంతో ఈ యాసంగి సాగు 1,66,319 ఎకరాలకు అధికారులు అంచనా వేశారు.. అయితే అందులో సగానికి సగం సైతం సాగుకాకపోవడం గమనార్హం. రైతుబంధు(పంటల పెట్టుబడి) సైతం చాలా మంది రైతులకు అందకపోవడం కూడా సాగు విస్తీర్ణంపై ప్రభావం పడింది. ఏదిఏమైనా ఖమ్మంజిల్లాలో ఇంత కనిష్ఠస్థాయిలో యాసంగి పంటలు సాగుకావడం ఇదే తొలిసారి.

ఖమ్మం వ్యవసాయం, జనవరి 11 : వ్యవసాయ, ఉద్యానపంటల సాగుకు చిరునామాగా ఉన్న ఖమ్మం జిల్లాలో తొలిసారిగా యాసంగి సాగు కనిష్ఠస్థాయిలో కనిపిస్తున్నది. భిన్నపంటల సాగుకు కేరాఫ్‌గా మారిన జిల్లా రైతాంగం ఈ సంవత్సరం సాగు చేయలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. వానకాలం సీజన్‌లో వారంరోజుల వ్యవధిలోనే ఒకేసారి భారీ వర్షపాతం నమోదైన సందర్భం తప్ప మిగిలిన రోజుల్లో ఆశించిన వర్షాలు పడలేదు. కేవలం సాగర్ కాలువ నీటిపై ఆధారపడి రైతులు వానకాలం సాగు పూర్తిచేశారు. సహజంగా ప్రతి ఏడాది యాసంగి సీజన్‌లో జిల్లాలో వరి, మక్కసాగు రికార్డు స్థాయిలో జరుగుతుంది. గత ఏడాది మక్కసాగు ఊహించని విధంగా సుమారు 91 వేల ఎకరాల్లో సాగుచేశారు. వరిసాగు దాదాపు 2 లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేశారు. అయితే వానకాలంలో ఆశించిన వర్షపాతం నమోదు కాకపోవడంతో జిల్లా వ్యవసాయశాఖ ఈ సంవత్సరం యాసంగి సీజన్‌లో జిల్లావ్యాప్తంగా ఆయారకాల పంటలు కలిపి 1,66,319 ఎకరాల్లో సాగుకావచ్చని అంచనా వేశారు. వరి సుమారు 1 లక్ష ఎకరాలు, మక్కసాగు మరో 50వేల ఎకరాల్లో సాగుకావచ్చని అధికారులు అంచనా వేశారు. అయితే గతంలో ఎన్నడూ లేనివిధంగా యాసంగి సాగు గణనీయంగా తగ్గింది.. అంచనాలో సగానికి సగం సైతం సాగు కాలేదు. దీంతో యాసంగి సీజన్‌లో పచ్చగా కనిపించే ప్రాంతాలు నేడు బోసిపోయి కనిపిస్తున్నాయి. ఇప్పటికే మార్కెట్లో బియ్యం ధరలు ఆకాశాన్ని అంటుతుండగా, యాసంగి తరువాత మరింత పెరిగే అవకాశం ఉంది.

**ఈ యాసంగిలో..**

జిల్లావ్యాప్తంగా ఈ సంవత్సరం నేటివరకు వ్యవసాయ, ఉద్యాన పంటలు కలిపి సుమారు 50 వేల ఎకరాల్లో వివిధ పంటల సాగు జరిగింది. వీటిలో వరి 15,782 ఎకరాలు, మక్క 31,644 ఎకరాలు, పత్తి 2 ఎకరాలు, చెరుకు 12 ఎకరాలు, వేరుశనగ 370 ఎకరాలు, మినుము 287 ఎకరాలు, పెసర 1,612 ఎకరాలు, ఇతర పంటలు 150 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వీటితోపాటు మరో 159 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. మొత్తంగా 50,006 ఎకరాల్లో ఈ యాసంగి సీజన్‌లో పంటల సాగు జరుగుతున్నది.

**ఈ ఐదేండ్లలో యాసంగి సాగు..**

- 2019 - 3,02,314 ఎకరాలు
- 2020 - 3,37,450 ఎకరాలు
- 2021 - 2,11,330 ఎకరాలు
- 2022 - 3,15,375 ఎకరాలు
- 2023 - 50,006 ఎకరాలు (నేటివరకు)

## యాసంగిపై సాగునీటి ప్రభావం

జిల్లాలో యాసంగి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోవడానికి ప్రధాన కారణం సాగర్ ఎడమ కాలువకు నీటి విడుదల లేకపోవడమే అని అధికారులు, రైతులు చెబుతున్నారు. జిల్లాలో మొత్తం 21 మండలాలు ఉండగా 16 మండలాలు కేవలం సాగర్ ఆయకట్టు పరిధిలోనే ఉన్నాయి. ప్రతిఏటా వానకాలం, యాసంగి సీజన్‌లో రైతులు ఎక్కువగా సాగర్ నీటి మీద ఆధారపడి సాగు చేస్తున్నారు. సాగర్ కాలువ పరిధిలో సుమారు 1.50 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. మైదాన ప్రాంతంలో చెరువులు, కుంటలు, బోరుబావుల కింద మరో 2 లక్షల ఎకరాలు సాగు జరుగుతున్నది. అయితే వానకాలం సీజన్‌లోనే ఆశించిన వర్షపాతం నమోదు కాకపోవడంతో భూగర్భ జలాలు కనిష్ఠ స్థాయికి చేరాయి. వీటికితోడు నాగార్జునసాగర్ డ్యామ్‌లో సైతం సాగునీరు డెడ్‌స్టోరేజీకి చేరడంతో ఎడమ కాలువకు నీరు విడుదలకావని కొద్దిరోజుల క్రితమే సంబంధిత అధికారులు తెలిపారు. దీంతో యాసంగి సాగు కేవలం బోరుబావుల్లో పుష్కలంగా నీరు ఉన్న ప్రాంతాల్లోనే రైతులు సాగు చేపట్టారు. దీనికి తోడు యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతుబంధు (పంటల పెట్టుబడి) సైతం చాలామంది రైతులకు అందకపోవడంతో సాగు విస్తీర్ణంపై ప్రభావం కనపడుతున్నది. ఏదిఏమైనా రాష్ట్రంలోనే అత్యధికంగా సాగు జరిగే ఖమ్మంజిల్లాలో తొలిసారిగా కనిష్ఠస్థాయిలో యాసంగి పంటలు సాగుకావడం విచారకరం.

### ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి



యాసంగిలో రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి. ఈ సంవత్సరం సాగునీటి లభ్యత లేకపోవడం వల్ల జిల్లా వ్యాప్తంగా యాసంగి సాగు విస్తీర్ణం బాగా తగ్గింది. వ్యవసాయశాఖ అధికారులు ఆరుతడి పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. వరికి సంబంధించి డైరెక్టు సీడ్ పద్ధతిలో సాగు చేసుకోవడం ఎంతో ఉత్తమం. కరివేద పద్ధతిలో వరిసాగు వల్ల సమయం, తక్కువ నీటివసతితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది.

– యం.విజయనిర్మల, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

## గతేడాది యాసంగి..

గత సంవత్సరం యాసంగి సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 3,15,375 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. వరి 2,14,892 ఎకరాలు, కంది 14 ఎకరాలు, మక్క 91,227 ఎకరాలు, జొన్న 340 ఎకరాలు, పెసర 3,463 ఎకరాలు, వేరుశనగ 554 ఎకరాలు, జనుము 426 ఎకరాలు, చెరుకు 3,371 ఎకరాల్లో సాగు చేశారు. ఇతర పంటలు మరో 800 ఎకరాల్లో సాగు చేశారు.

# పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం కావాలి

- మానుకోట గడ్డపై గులాబీ జెండా ఎగరాలి
- కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం..
- కాంగ్రెస్ పార్టీవి 420 హామీలు..
- ఆ పార్టీ విధానాలను ప్రజల్లో ఎండగట్టాలి
- మహబూబాబాద్ పార్లమెంట్ స్థాయి సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- హాజరైన ఏడు నియోజకవర్గాల ముఖ్య నాయకులు

'కాంగ్రెసోళ్లు అధికారంలోకి వస్తామని ఏనాడు అనుకోలేదు.. నోటికి ఏదొస్తే అది హామీ ఇచ్చి ప్రజలను మభ్యపెట్టిండ్లు.. వాళ్ల మోసపూరిత వాగ్దానాలను నమ్మి గొప్పగా పనిచేసిన నాయకులను కూడా ప్రజలు తిరస్కరించారు.. రానున్న పార్లమెంట్ ఎన్నికలు మన గెలుపునకు సోపానం కావాలి.. కష్టపడి పనిచేసి పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి' అని బీఆర్ఎస్ వర్కింట్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం సన్నాహక సమావేశంలో ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పక్కన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

మహబూబాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ) : మానుకోట పార్లమెంట్ నియోజకవర్గంపై గులాబీ జెండా ఎగరేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు శ్రేణులకు పిలుపునిచ్చారు. 2014, 2019లో విజయం సాధించామని, ఈ సారి జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంపై నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రజలు మనకు పదేళ్లు అవకాశమిచ్చారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పాలించినట్లు తెలిపారు. తాము అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ పార్టీ వాళ్లు అనుకోలేదని, నోటికి ఏదొస్తే అది హామీ ఇచ్చి ప్రజలను మభ్యపెట్టారని అన్నారు. ఆరు గ్యారెంటీలు అన్నారు.. కానీ, అవి 420 హామీలని, వాళ్ల తప్పుడు ప్రచారాన్ని నమ్మి ప్రజలు గొప్పగా పని చేసిన నాయకులను కూడా తిరస్కరించినట్లు తెలిపారు. దేశంలో అత్యధికంగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చింది మన ప్రభుత్వమేనని, ప్రభుత్వ ఉద్యోగులకు అత్యధిక వేతనాలు ఇచ్చింది మన ప్రభుత్వమేనని, అయినా ఏనాడు చెప్పుకోలేదు.. ప్రచారం చేసుకోలేదన్నారు. దేశంలో అందరికన్నా ఎక్కువగా ప్రభుత్వ ఉద్యోగులకు 73శాతం జీతాలు పెంచిన ఏకైక ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమన్నారు. స్థానిక సంస్థల నుంచి మొదలుకొని అసెంబ్లీదాకా బలమైన నాయకత్వం మనకున్నదని, బలమైన ప్రతిపక్షం మనదన్నారు. అన్నిటికీ మించి కేసీఆర్ లాంటి గొప్ప నాయకుడు మనకున్నారని అన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికలే మన గెలుపునకు సోపానం కావాలన్నారు. ఎన్నికల ముందు రైతు రుణమాఫీపై రేవంత్‌రెడ్డి అనేక మాటలు మాట్లాడారని, రుణం ఉన్నవాళ్లే కాదు.. లేని వాళ్లు కూడా తీసుకోండి.. మేము అధికారంలోకి రాగా వెంటనే రుణమాఫీ చేస్తామన్నారు.. కానీ, ఇంత వరకు అతీగతి లేదన్నారు. ఇచ్చిన అడ్డగోలు హామీలను నెరవేర్చే దారిలేకనే అప్పులు, శ్వేతపత్రాలంటూ నాటకాలు ఆడుతున్నారని అన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలియాలనే స్వేద పత్రం రూపొందించామన్నారు. ఎవరూ నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని, మన పార్టీకి బలమైన నాయకులు, అద్భుతమైన నాయకత్వం ఉన్నదన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సమావేశాలను వరుసగా పెట్టుకుంటూ.., అనుబంధ సంఘాలను బలోపేతం చేస్తూ, అన్ని వర్గాలకు వర్గాలకు దగ్గరయ్యేలా కార్యక్రమాలు చేపడుతామన్నారు. గిరిజనులకు స్థానిక సంస్థల రిజర్వేషన్‌తో పాటు పోడు పట్టాల పంపిణీ, అనేక ఇతర సంక్షేమ పథకాలను మన ప్రభుత్వం అందించినా ప్రజలు మనకు పూర్తి మద్దతు ఇవ్వలేదన్నారు. ఇలాంటి అంశాలను విమర్శచేసుకుంటూ ముందుకెళ్దామని కేటీఆర్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

**నాలుగు మెడికల్ కాలేజీలు ఇచ్చాం.. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు**

మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో నాలుగు మెడికల్ కాలేజీలు ఇచ్చామని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా విద్య, వైద్యం, వ్యవసాయం, రోడ్లను అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. కాంగ్రెస్ పార్టీ గోబెల్స్ ప్రచారాన్ని గ్రామాల్లో చర్చ చేయాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అందరం కష్టపడి పని చేసి పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా అండగా ఉంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసుల నుంచి కార్యకర్తలను కాపాడేందుకు ప్రత్యేకంగా లీగల్ సెల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే గ్రామ స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు కమిటీలు వేసుకొని పార్టీ బలోపేతానికి మరింత కృషి చేద్దామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంపీ కవిత, ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యేలు డీఎస్ రెడ్యానాయక్, బానోత్ శంకర్‌నాయక్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, హరిప్రియానాయక్, ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి, మాజీ ఎంపీ సీతారాంనాయక్ పాల్గొన్నారు.

# నేటితో 'ఆన్‌లైన్' ప్రక్రియ పూర్తి

**భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల**



భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 11 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఆరు గ్యారెంటీ దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ శుక్రవారంతో పూర్తి కానున్నదని భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. గురువారం సంబంధిత అధికారులతో మాట్లాడిన ఆమె ఆన్‌లైన్ ప్రక్రియ గురించి తెలుసుకున్న అనంతరం మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులను ఆయా మండలాల ఎంపీడీవోలు తమ కార్యాలయాల్లో ఆన్‌లైన్ చేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 3,33,225 దరఖాస్తులు రాగా.. వాటిలో 3,14,583 ఆన్‌లైన్ చేశామన్నారు. మొత్తంగా 94 శాతం ప్రక్రియ పూర్తయిందన్నారు. అత్యధికంగా అశ్వాపురం, భద్రాచలం, కరకగూడెం, మణుగూరు, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో వంద శాతం పూర్తయ్యాయన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 57,823 దరఖాస్తులు రాగా.. అందులో 54,582 ఆన్‌లైన్ అయినట్లు తెలిపారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా మరోసారి ఆపరేటర్లు వెరిఫికేషన్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

# మొండికేస్తున్న టీచర్లు!

- 'పది'లో మెరుగైన ఫలితాల కోసం 'పని' సర్దుబాటు చేసిన అధికారులు
- భద్రాద్రి జిల్లాలో 41 మంది ఉపాధ్యాయులకు ఉత్తర్వులు
- విధుల్లో చేరింది 20 మంది మాత్రమే..
- మిగిలిన వారికి వంతపాడుతున్న సంఘాల లీడర్లు
- ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని అధికారులపై ఒత్తిడి



డీఈవో కార్యాలయం

కొత్తగూడెం ఎడ్యుకేషన్, జనవరి 11 : పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు జిల్లా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఈ ఏడాది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 12,340 మంది రెగ్యులర్, 600 మంది ప్రైవేట్ విద్యార్థులు మొత్తం 12,940 మంది పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. మార్చి 18వ తేదీ నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు అవసరమైనచోట ఉపాధ్యాయులను రేషనలైజేషన్‌గా 'పని' సర్దుబాటు చేశారు. ఎంఈవోల వద్ద ప్రతిపాదనలు తీసుకొని మండలస్థాయిలో సబ్జెక్టు నిపుణులు, భాషాపండితులను ఎంపిక చేశారు. 41మంది ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో రెండునెలలపాటు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఉత్తర్వులు జారీచేసి నాలుగురోజులు గడుస్తున్నప్పటికీ విధుల్లో చేరేందుకు కొంతమంది ఉపాధ్యాయులు సుముఖత చూపడం లేదు. ఇప్పటివరకు 20మంది ఉపాధ్యాయులు మాత్రమే విధుల్లో చేరారు. విధుల్లో చేరకుండా మొండికేస్తున్న టీచర్లకు కొంతమంది ఉపాధ్యాయసంఘాల నేతలు వంతపాడుతున్నట్లు తెలుస్తోంది. ఏకంగా జిల్లా స్థాయి అధికారులపైనే ఒత్తిడి తెచ్చి ఆ ఉపాధ్యాయులు పని సర్దుబాటుకి వెళ్లరని, ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై డీఈవో వెంకటేశ్వరచారిని వివరణ కోరగా.. పని సర్దుబాటు చేసిన చోటికి టీచర్లు కచ్చితంగా వెళ్లాల్సిందేనని తేల్చిచెప్పారు.

# రిసెప్షనిస్టు పాత్ర కీలకం


**ఖమ్మం సీపీ సునీల్‌దత్**



మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్

మామిళ్లగూడెం, జనవరి 11 : పోలీస్‌స్టేషన్లలో రిసెప్షనిస్టుల పాత్ర చాలా కీలకమని, పలు సమస్యలపై ఠాణాకు వచ్చే ప్రతి ఒక్కరిని మర్యాదపూర్వకంగా పలకరించి మన్ననలు పొందాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. పోలీస్‌స్టేషన్లలోని రిసెప్షన్ సెంటర్లలో పోలీస్ సిబ్బంది పాత్రపై గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయం చేసే విధంగా కృషి చేయాలన్నారు. ఎక్కడ కూడా విమర్శలకు తావు లేకుండా పారదర్శకతను పాటిస్తూ ప్రజల ప్రశంసలు, మెప్పు పొందాలన్నారు. ఫ్రెండ్లీ పోలీస్‌లో భాగంగానే రిసెప్షన్ సెంటర్‌ను ప్రారంభించుకున్నామన్నారు. వివిధ పనుల కోసం ఠాణాకు వచ్చే సమయంలో స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వో లేకుంటే వచ్చేంత వరకు స్టేషన్ బయట వేచి ఉండకుండా.. ఇబ్బందులు పడకుండా వచ్చిన పని పూర్తయ్యేంత వరకు రిసెప్షన్ సెంటర్‌లో వేచి ఉండేలా అన్ని వసతులు కల్పించాలన్నారు. రిసెప్షన్ సెంటర్‌లో సిబ్బంది 24 గంటలపాటు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. బాధితులు తొలుత ఏ పనిపై స్టేషన్‌కు వచ్చారో ఫిర్యాదును రిజిస్టర్‌లో నమోదు చేసుకొని, సంబంధిత పోలీస్ అధికారి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అలాగే బాధితులు ఇచ్చిన ఫిర్యాదు స్థితిగతులను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

## సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలని ఫిర్యాదు



డీసీవోకు ఫిర్యాదు పత్రం అందిస్తున్న సొసైటీ డైరెక్టర్లు

ఖమ్మం వ్యవసాయం, జనవరి 11 : ఖమ్మం నియోజకవర్గంలోని వీ వెంకటాయపాలెం సొసైటీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్యపై అవిశ్వాస సమావేశం ఏర్పాటు చేసి పదవి నుంచి తొలగించాలని సొసైటీ డైరెక్టర్లు డీసీవో విజయకుమారికి గురువారం ఫిర్యాదు చేశారు. ఖమ్మం నగరంలోని జిల్లా సహకార అధికారి కార్యాలయంలో డీసీవో విజయకుమారిని సొసైటీ ఉపాధ్యక్షుడు రావెళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో 11 మంది డైరెక్టర్లు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సొసైటీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య అందుబాటులో ఉండడం లేదని, ఆయనపై నమ్మకం, విశ్వాసం కోల్పోయామన్నారు. వెంటనే అవిశ్వాసం పెట్టేందుకు నిర్ణయం తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా.. కొద్ది రోజుల్లోనే సొసైటీ డైరెక్టర్లకు నోటీసులు జారీ చేసి.. సమావేశం ఏర్పాటు చేస్తామని డీసీవో తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు రావూరి సైదుబాబు తోపాటు పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు. కాగా.. కూరాకుల నాగభూషయ్య బీఆర్ఎస్ పార్టీ నుంచి ఖమ్మం డీసీసీబీ చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

# సీతారామ పనులను వేగవంతం చేయండి


**అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష**



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సత్తుపల్లి రూరల్, జనవరి 11 : ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే సీతారామ ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి ఈ ఏడాది గోదావరి జలాలు అందించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సత్తుపల్లి మండల పరిధిలోని యాతాలకుంటలో జరుగుతున్న సీతారామ టన్నెల్ పనులను సత్తుపల్లి, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, జారే ఆదినారాయణతో కలిసి గురువారం పరిశీలించారు. అనంతరం యాతాలకుంటలోని సీతారామ ప్రాజెక్టు క్యాంపు శిబిరంలో జరిగిన విలేకరుల సమావేశంలో తుమ్మల మాట్లాడుతూ రూ.13 వేల కోట్ల అంచనాతో చేపడుతున్న సీతారామ ప్రాజెక్టు నిర్మాణ పనులు ఇప్పటివరకు 60శాతం మేరకు పూర్తవ్వగా రూ.7,500 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ప్రాజెక్టు మెయిన్ కెనాల్ 192 కిలోమీటర్ల మేర, ట్రంక్ కెనాల్ 116 కిలోమీటర్ల మేర ప్రవహిస్తాయన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 10లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యంగా ప్రారంభించిన ఈ ప్రాజెక్టు అతిత్వరలో పూర్తిచేసి బేతుపల్లి, లంకాసాగర్, వైరా, నాగార్జునసాగర్ కెనాల్ ద్వారా ఉమ్మడి జిల్లాలకు సాగునీరు అందిస్తామన్నారు. గండుగులపల్లిలో నాల్గవ పంపు హౌస్ పనులు పూర్తవుతున్నాయని, ఆ పనులు పూర్తయితే దమ్మపేట, అశ్వారావుపేట మండలాలకు సైతం గోదావరిజలాలు అందుతాయన్నారు. సత్తుపల్లి మండలంలోని యాతాలకుంట టన్నెల్ ప్రధానమైందని, ఇది పూర్తయితేనే బేతుపల్లి, లంకాసాగర్, వైరా ప్రాజెక్టులకు సాగునీరు అందుతుందని, యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేయాలని అధికారులను తుమ్మల ఆదేశించారు. ములకలపల్లి మండలం పూసుగూడెం, కమలాపురం, సత్తుపల్లి మండలం యాతాలకుంట టన్నెల్ పనులు పూర్తవుతున్నాయన్నారు. రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణపనులు సైతం వీలైనంత త్వరగా పూర్తిచేసి ప్రాజెక్టు పనులు పూర్తిచేయాలన్నారు. తన రాజకీయ జీవితంలో లక్ష్యంగా పెట్టుకున్న సీతారామ ప్రాజెక్టును పూర్తిచేసి ఆ గోదావరి జలాలను ఉమ్మడి జిల్లాకు పారించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తుమ్మల స్పష్టం చేశారు. భూ నిర్వాసితులకు ఇవ్వాల్సిన పరిహారం సైతం వెంటనే చెల్లించేవిధంగా ఏర్పాట్లు చేయాలని అక్కడి నుంచే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. సీతారామ కాలువను నాగార్జునసాగర్ కెనాల్‌లో కలిపేందుకు ఆరేడు కిలోమీటర్ల మేర కాలువ తవ్వేందుకు టెండర్లు పిలవాలని ఇప్పటికే అధికారులను ఆదేశించామని, ఆ పనులు కూడా త్వరలో పూర్తయితే ఈ నీటిని నాగార్జునసాగర్ కెనాల్ ద్వారా మధిర నియోజకవర్గానికి సైతం పారిస్తామన్నారు. టన్నెల్ నిర్మాణంలో ఎలాంటి ఆటంకం కలగకుండా రెండువైపులా పనులు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల విషయంలో ఏ సమస్య తలెత్తినా తన దృష్టికి తేవాలని ఆయన అధికారులు, గుత్తేదారులకు సూచించారు. సమావేశంలో ఆర్డీవో అశోకచక్రవర్తి, తహసీల్దార్ యోగేశ్వరరావు, ఏసీపీ రామానుజం, ఇరిగేషన్ ఎస్‌ఈ శ్రీనివాసరెడ్డి, ఈఈలు సురేశ్, శ్రీనివాసచారి, హెచ్‌ఈఎస్ చైర్మన్ కేశవరాజు, డీఈ చంద్రశేఖర్, ఏఈల తోపాటు నాయకులు మట్టా దయానంద్ విజయ్‌కుమార్, చల్లగుళ్ల నర్సింహారావు, కొప్పుల నరేందర్‌రెడ్డి, పమ్మిన రవి, నరుకుళ్ల అప్పారావు, వెచ్చా రాంప్రసాద్ పాల్గొన్నారు.

# మిర్చి తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



మిర్చి తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

ఖమ్మం వ్యవసాయం, జనవరి 11 : జిల్లాలోని రఘునాథపాలెం, ముదిగొండ, చింతకాని, తల్లాడ, వేంసూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో గల మిర్చి తోటలను క్షేత్రస్థాయిలో రాష్ట్ర ఉద్యాన యూనివర్సిటీ, కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్తలు, సంబంధిత శాఖల అధికారులు గురువారం పరిశీలించారు. మిర్చి పంట నాణ్యత కోల్పోవడం, తగ్గిన దిగుబడులకు గల కారణాలను అన్వేషించి సమగ్ర నివేదికను రూపొందించాలని సంబంధిత అధికారులకు రెండు రోజుల క్రితం రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింట్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల పర్యటన నిమిత్తం శాస్త్రవేత్తలు, అధికారుల బృందం మిర్చి తోటలతోపాటు కల్లాలను సైతం సందర్శించారు. జిల్లాలో కొద్ది రోజుల క్రితం కురిసిన వర్షాల వల్ల మిర్చి తోటలకు సోకిన తెగుళ్లు, మచ్చలు, తద్వార తగ్గిన దిగుబడులపై పరిశోధనతోపాటు రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత పరిస్థితిలో మిర్చి సాగు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎరువులు, పురుగు మందుల పిచికారీ తదితర అంశాలపై రైతులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఉద్యాన యూనివర్సిటీ శాస్త్రవేత్త డాక్టర్ టీ.సురేశ్, కేవీకే శాస్త్రవేత్తలు రవి, ఏ.శైలజ, ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ వేణుగోపాల్, వ్యవసాయ శాఖ డీడీ ఎస్.మోహన్‌రెడ్డి, డీఏవో విజయనిర్మల, జిల్లా ఉద్యాన శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ.రమణ, మార్కెటింగ్ శాఖ జేడీ వీ.శ్రీనివాస్, ఏడీఏ సరిత, డీఎంవో అలీం, ఆయా మండలాల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.